## సిలికాన్ వేలీలో అన్నమయ్య



సిలికాన్ వేలీ: సిరుతనవ్వుల సిన్నక్కలు సుమధురగానంతో సమ్మోహనపరచిన శుభవేళ...
బాలకులు భావమునందునా, బాహ్యమునందునా గోపాలబాలునే భావించిన భవ్యతరుణం....
పదునాలుగు గంటల పాటు వందలాది కళాకారులచే అప్రతిహతంగా అన్నమయ్యపదాలతో సుస్వరార్చన...
వందలాది ప్రేక్షకులు 'కదిలితే ఏ అనుభూతి పోగొట్టుకుంటామో' అన్న ఆతృతతో తమను తాము కట్టిపడేసుకుని సంగీతసాగరంలో ఓలలాడిన దృశ్యం...
ఇవన్నీ ఒక పరాయి దేశంలో తెలుగువారు గత శనివారం నాడు పొందిన దివ్యానుభూతుల విశేషాలు. పదకవితకు ప్రవాసంలో లభించిన అపూర్వాదరణకు నిదర్శనాలు.

అమెరికా ఖండంలోని సిలికాన్ వేలీలో తెలుగువారు అన్నమయ్యపద కవితకు మరోమారు పట్టం కట్టి పునీతులయిన సందర్భం, సిలికానాంధ్ర - సన్నివేల్ దేవాలయం (హిందూ కమ్యూనిటీ సెంటర్) సంయుక్తంగా నిర్వహించిన 'అన్నమాచార్య సంకీర్తనోత్సవం' జనవరి 20, 2007 శనివారం నాడు ఉదయం 9.గంటల నుండి రాత్రి 10.30 వరకు ఏకధాటిగా సాగిన సంకీర్తనోత్సవం శాస్త్రీయ సంగీతాభిమానులను రసమయలోకాల్లో విహరింపజేసి దిగ్విజయమయింది. సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో ప్రారంభమయి, వేలాది అన్నమయ్య కృతులలో ఒక 116 కీర్తనలను పాడుతూ, నర్తిస్తూ పదకవితా పితామహునికి నివాళిగా ఒక రోజంతా సంకీర్తనోత్సవం జరుపుకున్నారు సిలికానాంధ్రులు. ప్రవేశ ద్వారం నుండి రంగు రంగుల జెండాలతో, అన్నమాచార్య

పదాలు నిండిన బ్యానర్లతో కార్యకర్తలు పండుగ వాతావరణం కల్పించారు.

